# మార్కెట్లోకి బజాజ్ గోగో ఈ-ఆటో

### సింగిల్ చార్జింగ్‌తో 251 కిలోమీటర్లు



హైదరాబాద్, మే 13: ప్రముఖ ద్వి, త్రిచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో..తాజాగా మార్కెట్లోకి మరో ఈ-ఆటోను అందుబాటులోకి తీసుకొచ్చింది. గోగో పేరుతో విడుదల చేసిన ఈ ఆటో సింగిల్ చార్జింగ్‌తో 251 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ సెగ్మెంట్‌లో విడుదలైన ఆటోలో ఇదే అత్యధిక మైలేజీ ఇచ్చే వాహనం ఇదేనని బజాజ్ ఆటో ప్రెసిడెంట్ సమర్‌దీప్ సుబాంధ్ తెలిపారు. శక్తివంతమైన ఎల్ఈడీ లైట్స్, హిల్ హోల్డ్ అసిస్ట్, ఆటో హజార్డ్, యాంటీ-రోల్ డిటెక్షన్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. రెండు రకాల్లో లభించనున్న ఈ ఆటోలో 9 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ప్యాసింజర్ మాడల్ ధర రూ.3,26,797 గాను, 12 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.3,83,004గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి.

# సూచీల్లో ప్రాఫిట్ బుకింగ్

### సెన్సెక్స్ 1,282, నిఫ్టీ 346 పాయింట్ల పతనం



ముంబై, మే 13: దేశీయ స్టాక్ మార్కెట్ల ర్యాలీకి బ్రేక్‌పడింది. ఐటీ, వాహన, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగ షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో మంగళవారం సూచీలు భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో 1,386 పాయింట్లు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరికి మార్కెట్ ముగిసే సమయానికి 1,281.68 పాయింట్లు లేదా 1.55 శాతం నష్టపోయి 81,148.22 వద్ద ముగిసింది. 30 షేర్ల ఇండెక్స్ సూచీల్లో 25 సూచీలు నష్టపోగా, కేవలం ఐదు సూచీలు లాభాల్లో ముగిశాయి. మరోసూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 346.35 పాయింట్లు లేదా 1.39 శాతం కోల్పోయి 24,578.35 వద్ద స్థిరపడింది. ఐటీ రంగ షేర్లు కుదేలయ్యాయి. దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ షేరు 3.54 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. ఐటీతో పాటు ఎఫ్ఎంసీజీ, వాహన రంగ షేర్లలో అమ్మకాలు అత్యధికంగా జరగడం సూచీల పతనానికి కారణమని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

**కదంతొక్కిన రక్షణ రంగ షేర్లు**

ఒకవైపు స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయినప్పటికీ మరోవైపు రక్షణ రంగ షేర్లు కదంతొక్కుతున్నాయి. వరుసగా రెండోరోజు మంగళవారం పది శాతానికి పైగా పెరిగాయి. దీంట్లో భారత్ డైనమిక్స్ షేరు అత్యధికంగా 11 శాతానికి పైగా లాభపడింది. యాక్సిస్కేడ్స్ టెక్నాలజీ 5 శాతం, డాటా ప్యాటర్న్ 4 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 4 శాతం, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ 3.81 శాతం, మిశ్రా ధాతు నిగమ్ 3.44 శాతం, పారస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీస్ 2.84 శాతం, డీసీఎక్స్ సిస్టమ్స్ 2.81 శాతం చొప్పున పెరిగాయి. డ్రోన్ల తయారీ సంస్థ ఐడియాఫోర్జ్ టెక్నాలజీ 9.26 శాతం ఎగబాకింది.

# తగ్గిన ఆభరణాల ఎగుమతులు

ముంబై, మే 13: ఆభరణాల ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. గడిచిన నెలలో జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 4.62 శాతం తగ్గి 2,037.06 మిలియన్ డాలర్లకు పరిమితమైనట్టు జెమ్ అండ్ జ్యూవెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) తాజాగా వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో 2,135.7 మిలియన్ డాలర్ల విలువైన ఆభరణాలు ఎగుమతి అయ్యాయి. అలాగే కట్ అండ్ పాలిష్ డైమండ్ల ఎగుమతులు 6.12 శాతం తగ్గి 1,108.74 మిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు వెల్లడించింది. గత నెలలో బంగారం ఆభరణాల ఎగుమతులు కూడా 5.41 శాతం తగ్గి 684.51 మిలియన్ డాలర్లకు తగ్గగా..వెండి ఆభరణాల ఎగుమతులు కూడా 12 శాతం దిగి 38.3 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

# పరిశ్రమలకు భూములేవి?

**టీజీఐఐసీలో నిలిచిన భూముల కేటాయింపు • అధికార పార్టీ సిఫారసు ఉంటేనే దరఖాస్తుల పరిశీలన**




హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): భారీగా పెట్టుబడులు తెస్తున్నట్టు, పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తున్నట్టు ప్రభుత్వం పదే పదే చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో మాత్రం ఆచరణకు నోచుకోవడం లేదు. గత సంవత్సరకాలంగా పరిశ్రమల కోసం భూముల కేటాయింపును టీజీఐఐసీ నిలిపివేయడమే ఇందుకు నిదర్శనమని పరిశీలకులు పేర్కొంటున్నారు. చిన్నచిన్న యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలనుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు భూముల కోసం టీజీఐఐసీ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కేవలం ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫారసు ఉన్నవారికి మాత్రమే భూములు విక్రయిస్తుండగా, ఎవరి సిఫారసు లేకుండా ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తులను పరిశీలించే నాథుడే లేకుండాపోయాడు. సొంత వ్యాపారాలపై దృష్టి పెడుతున్న యువత ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు ముందుకొస్తున్నారు. పారిశ్రామిక రంగంలో 95 శాతం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలే (ఎంఎస్ఎంఈ) ఉన్నాయి. అత్యధికంగా ఉపాధిని కల్పిస్తున్నది కూడా ఈ పరిశ్రమలే. రూ.50 కోట్లలోపు పెట్టుబడి ఉన్న పరిశ్రమలన్నీ ఈ కోవలోకి వస్తాయి. వీటికి భూమి కూడా పెద్దగా అవసరం ఉండదు. సుమారు 500 గజాల నుంచి రెండు ఎకరాల లోపు భూమి ఉంటే చాలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహకాలు కూడా లభిస్తుండటంతో చాలామంది తమ అభిరుచులకు అనుగుణంగా ఏదో ఒక చిన్నతరహా పరిశ్రమను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొస్తున్నారు. వీరికి భూమి కొనుగోలు చేయడం అనివార్యం. టీజీఐఐసీ అభివృద్ధి చేసిన లేఔట్లలో భూములు కొనుగోలుచేస్తే న్యాయపరంగా ఎటువంటి చిక్కులు ఉండకపోవడంతో పాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు కూడా సులభంగా లభిస్తాయి. అందుకే ఎక్కువశాతం మంది ప్రైవేటుగా భూములు కొనుగోలు చేసే బదులు టీజీఐఐసీ పారిశ్రామికవాడలవైపే మొగ్గుచూపుతారు.

**సిఫారసు ఉన్నవారికే ప్రాధాన్యం**

టీజీఐఐసీ దాదాపు ఏడాదికాలం నుంచి భూముల కేటాయింపు ప్రక్రియను పూర్తిగా నిలిపివేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా భూముల కేటాయింపు జరిగేది. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను వారం వారం పరిశీలించి అర్హతలకు అనుగుణంగా భూములు కేటాయించేవారు. వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి భూముల కేటాయింపు కోసం గతంలో ప్రతివారం బోర్డు సమావేశాన్ని నిర్వహించేవారు. అయితే ఏడాదికాలంగా ఈ సమావేశాలు జరగక.. దరఖాస్తులన్నీ పెండింగులో ఉన్నాయి. అధికారపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల నుంచి వచ్చిన సిఫారసుల ప్రకారమే భూముల కేటాయింపు జరుగుతున్నది తప్ప సొంతంగా ముందుకొచ్చే వారి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో కూడా పరిశీలించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

**మా ప్రయత్నం వృథా ప్రయాస**

టీజీఐఐసీ కార్యాలయానికి వెళ్తే ఉన్నతాధికారులు ఎవరూ అందుబాటులో ఉండటంలేదని, కిందిస్థాయి అధికారులు పట్టించుకోవడంలేదని కొందరు పారిశ్రామికవేత్తలు తెలిపారు. ప్రైవేటుగా భూములు కొనుగోలుచేసి యూనిట్ పెట్టుకుందామంటే ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలు వస్తాయో.. రావో అనే సందేహం ఉందని, అందుకే టీజీఐఐసీ చుట్టూ తిరుగుతున్నామన్నారు. తమ ప్రయత్నాలు వృథా ప్రయాసగానే మారుతున్నాయని వాపోతున్నారు.

**బీఆర్ఎస్ హయాంలోనే ల్యాండ్ బ్యాంక్...**


ఒకవైపు పారిశ్రామిక వాడల కోసం ప్రభుత్వం చేస్తున్న భూసేకరణ యత్నాలకు రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. గత బీఆర్ఎస్ సర్కారు ప్రభుత్వ భూములతో కూడిన దాదాపు 1.50 లక్షల ఎకరాల ల్యాండ్‌బ్యాంక్‌ను సిద్ధం చేసింది. దాదాపు 156 వరకూ ఇండస్ట్రియల్ పార్క్‌లను నెలకొల్పి 28 వేల ఎకరాలకుపైగా భూములను పరిశ్రమలకు కేటాయించింది. చాలా పార్క్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించి పరిశ్రమలకు కేటాయించాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా దృష్టి పెట్టకుండా కేవలం పెట్టుబడులు తెస్తున్నట్టు ఊదరగొడుతున్నది. స్థానికంగా అనేక మంది ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొస్తున్నా... వారికి భూములు కేటాయించకుండా బహుళజాతి కంపెనీలు వస్తున్నాయంటూ ప్రచారం చేస్తున్నది. మల్టీ నేషనల్ కంపెనీలు రావాల్సిన అవసరం ఎంత ఉన్నదో, ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు తోడ్పడాల్సిన అవసరం అంతకన్నా ఎక్కువ ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

# మరిన్ని వడ్డీరేట్ల కోతలు!

### ఆరేండ్ల కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం

### ఏప్రిల్‌లో 3.16 శాతానికి తగ్గిన ధరల సూచీ

### వచ్చే ఆర్బీఐ ద్రవ్యసమీక్షల్లో రెపో కోతలకు అవకాశం



న్యూఢిల్లీ, మే 13: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను మరింతగా తగ్గించేందుకున్న అవకాశాలు మెరుగయ్యాయి. గత నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణం దాదాపు ఆరేండ్ల కనిష్ఠానికి తగ్గింది. ఏప్రిల్‌లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.16 శాతంగా నమోదైనట్టు మంగళవారం విడుదలైన జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) డాటా చెప్తున్నది. 2019 జూలైలో 3.15 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ దరిదాపుల్లోకి ధరల సూచీ ఇప్పుడే శాంతించింది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో రెపోరేటు ఇంకా దిగొస్తుందన్న అంచనాలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) చొప్పున మొత్తం అర శాతం (50 బేసిస్ పాయింట్లు) తగ్గించింది. ఫలితంగా 6 శాతానికి దిగొచ్చింది.

**ఆర్బీఐ అనుకున్నట్టుగానే..**

ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఓవరాల్‌గా 4 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 3.6 శాతంగా, రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో 3.9 శాతంగా, మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో 3.8 శాతంగా, నాల్గో త్రైమాసికం (జనవరి-మార్చి)లో 4.4 శాతంగా నమోదు కావచ్చన్నది. ఈ ద్రవ్యోల్బణం ఆధారంగానే ఆర్బీఐ విధానాన్ని ప్రకటిస్తుందన్నది తెలిసిందే. ఈ నేపథ్యంలో నెలవారీ గణాంకాలు అంచనాలకు తగ్గట్టుగానే వస్తుండటంతో వడ్డీరేట్లు ఇంకా తగ్గుతాయన్న అభిప్రాయాలు క్రమేణా పెరుగుతున్నాయి.

**ఎన్ఎస్‌వో డాటా ప్రకారం..**

ఏప్రిల్‌లో కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, ఇతర ప్రొటీన్ సమృద్ధి ఆహారోత్పత్తుల ధరలు శాంతించాయి. దీంతో ఆహార ద్రవ్యోల్బణం గత నెలలో 1.78 శాతంగానే ఉన్నది. 2021 అక్టోబర్ తర్వాత ఇదే తక్కువ. గతంతో పోల్చితే ఆలుగడ్డ, టమాట, చికెన్, జీరా వంటివాటి ధరలు తగ్గాయని ఎన్ఎస్‌వో చెప్పుకొచ్చింది. ఇక అంతకుముందు నెల మార్చిలో 2.69 శాతంగా, నిరుడు ఏప్రిల్‌లో 8.7 శాతంగా ఆహార ద్రవ్యోల్బణం ఉండటం గమనార్హం. అలాగే రిటైల్ ధరల సూచీ కూడా ఈ మార్చిలో 3.34 శాతంగా, గత ఏడాది ఏప్రిల్‌లో 4.83 శాతంగా ఉన్నట్టు ఎన్ఎస్‌వో ఈ సందర్భంగా తెలియజేసింది.

# సెకీ సీఎండీపై వేటు

### నకిలీ డాక్యుమెంట్లతో రిలయన్స్ పవర్ టెండర్

### అనుమతించిన సెకీ సీఎండీ ఆర్‌పీ గుప్తా




న్యూఢిల్లీ, మే 13: సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) సీఎండీ ఆర్‌పీ గుప్తాను కేంద్ర ప్రభుత్వం తక్షణమే బాధ్యతల నుంచి తొలగించింది. ఇందుకు గల కారణాలను ప్రభుత్వం చెప్పకపోయినప్పటికీ.. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ అక్రమాలకు అండగా ఉండటం వల్లే వేటు పడినట్టు తెలుస్తున్నది. అయితే నకిలీ ధ్రువపత్రాలతో ఓ భారీ టెండర్‌కు రిలయన్స్ పవర్‌ను అనుమతించడమే కారణమని కేంద్ర నూతన, పునరుత్పాదక శక్తి మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ)లోని వర్గాలు చెప్పుకుంటున్నాయి. సెకీ టెండర్‌లో బ్యాంక్ గ్యారెంటీగా ఎస్బీఐని చూపుతూ గత ఏడాది అక్టోబర్‌లో రిలయన్స్ పవర్ అక్రమాలకు పాల్పడింది. అయితే ఈ విషయం తెలుసుకున్న ఎస్బీఐ.. ఈ గ్యారెంటీని తిరస్కరించింది. అయినప్పటికీ గుప్తా సహకారంతో టెండర్ ప్రక్రియలో రిలయన్స్ పవర్ పాల్గొన్నదన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఎస్బీఐ తీవ్రంగా పరిగణించడంతో సెకీ చివరకు రిలయన్స్ పవర్ టెండర్‌ను తిరస్కరించాల్సి వచ్చింది.

**వివాదాల్లో..**

గుప్తా హయాంలో సెకీ అనేక విమర్శల్ని, అపవాదుల్ని ఎదుర్కోవడం గమనార్హం. రెన్యువబుల్ ఎనర్జీ వేలాలు, ప్రాజెక్టుల నిర్వహణలో సెకీ వైఫల్యం స్పష్టంగా కనిపించింది. అంతేగాక జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, అదానీ వంటి బడా సంస్థలకు సంబంధించిన వివాదాల్లోనూ సెకీ ఇరుక్కున్నది. మరోవైపు గుప్తా వేటుపై సెకీ, ఎంఎన్ఆర్ఈ, రిలయన్స్ పవర్ వర్గాలేవీ కూడా స్పందించేందుకు ముందుకు రావడం లేదు. కాగా, గుజరాత్ క్యాడర్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గుప్తా.. 2023 జూన్ నుంచి సెకీ అధిపతిగా కొనసాగుతున్నారు. వచ్చే నెలతో ఈయన పదవీ కాలం ముగియాల్సి ఉన్నది.




## మరోసారి సత్తాచాటిన 'తేజస్వి'

హనుమకొండ చౌరస్తా, మే 13 : సీబీఎస్ఈ మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో తేజస్వి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో విజయదుందుభి మోగించినట్లు చైర్మన్ రేవూరి జెన్నారెడ్డి తెలిపారు. సిద్ధామూర్తి జ్ఞానతేజ, గంజి ఉదయ్‌నిక్షిత్ 487, లడే శ్రీవిద్య 481 మార్కులతో ఉత్తమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. అలాగే ఎస్ నందిత 479, భవ్యాంశ్ అగర్వాల్ 476, భూక్యశ్రీ కృష్ణకౌశిక్ 473, ఎం సునైన రీతుల్ 472, కే మీనాక్షి 471 మార్కులు సాధించినట్లు తెలిపారు. హంటర్‌రోడ్, ఎర్రగట్టుగుట్ట బ్రాంచుల్లో జిల్లాలో ఉత్తమస్థాయిలో అధిక మార్కులు సాధించటం తేజస్వి ఘనత అన్నారు. గత చరిత్రను ఎప్పటిలాగానే కొనసాగిస్తూ ఉత్తమ స్థానాన్ని నిలబెట్టుకుందన్నారు. సంవత్సరాలు, విద్యార్థులు మారినా విజయం కొనసాగించటం తేజస్వి పాఠశాల లక్ష్యమన్నారు. ఈ విజయపరంపర కొనసాగించిన విద్యార్థులు, వారి వెనుక ఉండి సహకరించిన బోధన, బోధనేతర సిబ్బందికి, తల్లిదండ్రులకు చైర్మన్ రేవూరి జెన్నారెడ్డి, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

## స్కిల్ స్టార్క్ విజయభేరి

హసన్‌పర్తి, మే 13 : సీబీఎస్ఈ మంగళవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో భీమారంలోని స్కిల్ స్టార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు విజయభేరి మోగించారు. వంగా హర్షిత 473, గూడూరి సాయి మన్విక్‌రెడ్డి 473, కటం పరిమళ్ 471 మార్కులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ ఎర్రబెల్లి అనూప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీబీఎస్ఈలో స్కిల్ స్టార్క్ స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు చదువుతో పాటు స్కిల్స్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఉజ్వలపవార్, బోర్డు ప్రిన్సిపాల్ సోనల్‌నిచట్ అభినందించారు.



ఫలితాలు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ ఎర్రబెల్లి అనూప్, ప్రిన్సిపాల్ ఉజ్వలపవార్

## గొంతులో మటన్ ముక్క ఇరుక్కొని వృద్ధుడి మృతి

మరిపెడ, మే 13 : గొంతులో మటన్ ముక్క ఇరుక్కొని అస్వస్థతకు గురై వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని కొత్తతండాలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట శివారు డీసీ తండాకు చెందిన జాటోత్ లక్ష్మణ్(68) కొత్త తండాలో దుర్గామాత పండుగ కోసం బంధువుల ఇంటికి వచ్చాడు. భోజనం చేసే క్రమంలో మటన్ ముక్క గొంతులో ఇరుక్కోవడంతో హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.


# సీబీఎస్ఈ పది ఫలితాల్లో గ్రీన్‌వుడ్ విజయకేతనం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ భరద్వాజ నాయుడు

హసన్‌పర్తి, మే 13 : సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో వంద శాతం ఉతీర్ణత సాధించారు. 500 మార్కులకు 496 మార్కులు సాధించిన పీ సహస్ర పాఠశాల టాపర్‌గా నిలిచారు. కే హంసిక, పీ సింధు ప్రియ, పీ మనోజ్ఞ 492, సీహెచ్ రిత్విక 489, బీ వైష్ణవి 486, ఆర్ అక్షర 485, బీ రిత్విక్ 482, ఎన్ సాన్విత్, కే సత్యానంద్ 481 మార్కులు సాధించారు. 450కి పైగా మార్కులు 74 మంది విద్యార్థులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ భరద్వాజ నాయుడుతో పాటు పాఠశాల జనరల్ మేనేజర్ ప్రభుకుమార్, అకడమిక్ ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, మంజులాదేవి, పవన్‌కుమార్, శ్రీకాంత్, సురేశ్‌కుమార్, రబ్బాని, మురళి, కోఆర్డినేటర్ హర్ష, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరద్వాజనాయుడు మాట్లాడుతూ ఎంచుకున్న లక్ష్యం కోసం విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.

# సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో ఎస్సార్ విజయభేరి




హనుమకొండ చౌరస్తా, మే 13: సీబీఎస్ఈ మంగళవారం ప్రకటించిన 12వ తరగతి ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించినట్లు చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన జీ సాయి హర్షిణి 500 మార్కులకు 480, ఆర్ స్వస్తిక 478, సీహెచ్ అన్సిక 477 మార్కులు సాధించి ఎస్సార్ కీర్తిప్రతిష్ఠను జాతీయస్థాయిలో నిలబెట్టినట్లు తెలిపారు. అలాగే కే అంజన సంతోషి 475, ఏ అమూల్య 472, వీ ప్రత్యూనరెడ్డి 470 మార్కులు సాధించినట్లు చెప్పారు. అత్యున్నత మార్కులు సా ధించిన విద్యార్థులను ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో మరింత అత్యుత్తమ మైన మార్కులు సాధించే లా తీర్చిదిద్దుతామని తెలిపారు. తమ విద్యార్థులు ఈ ఏడాది జేఈఈ (మెయిన్)లో జాతీయ స్థాయిలో సాధించిన ఉత్తమ ఫలితాలు విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకం కావాలని వారు ఆకాంక్షించారు.

**పది ఫలితాల్లోనూ అదేజోరు..**


సీబీఎస్ఈ ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లోనూ ఎస్సార్ విద్యాసంస్థల విద్యార్థులు అదే జోరు కొనసాగించినట్లు చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. ఎం రిషి 500 మార్కులకు 498, వీ వివేకానందరెడ్డి 487, కే జశ్వంత్ 487, బీ హృషికేశ్‌మూర్తి 485 మార్కులు, అలాగే ఏ సాయి కశ్యప్ 484, పీ అదిలాష్‌రెడ్డి 481, కే సాహిత్య 480 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంతటి విజయానికి క్రమశిక్షణతో కూడిన పాఠ్యప్రణాళిక, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయ బృందం కారణమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యావ్యవస్థలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా సృజనాత్మకతతో కూడిన విద్యనందిస్తున్నట్లు తెలిపారు. తమ విద్యాసంస్థల్లో పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా ఎస్సెస్సీ విద్యార్థులకు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌లో ఎక్కువ శ్రద్ధ తీసుకుంటామన్నారు. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థులు, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి ఎస్సార్ విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అభినందనలు తెలిపారు.




## వడదెబ్బతో ఇద్దరు మృతి

- **హనుమకొండ జిల్లాలో ఒకరు.. వరంగల్‌లో మరొకరు**

హసన్‌పర్తి/గీసుగొండ, మే 13 : ఉమ్మడి జిల్లా లో వడదెబ్బతో ఇద్దరు మృతి చెందారు. హనుమ కొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని సీతానాగారానికి చెందిన దావ రాజేందర్(40) గ్రామపంచాయతీ పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మంగ ళవారం విధులు నిర్వర్తించి సాయంత్రం ఇంటికి వచ్చి పడుకున్నాడు. ఎండదెబ్బ తగిలి రాజేందర్ అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. రాజేందర్ మృతదేహం వద్ద బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు బండి రజినీకుమార్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజేందర్ కుటుంబానికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట కారోబార్, బిల్ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతల్ల సదానందం, తగరం శివ తదితరులు ఉన్నారు. అదేవిధంగా వరంగల్ జిల్లా గీసుగొండ మండలం గంగదేవిపల్లిలో రైతు ఇట్ల నాగరాజు (35) 15-20 రోజుల నుంచి పసుపు ఉడకబెట్టేందుకు వెళ్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వడదెబ్బకు గురై స్పృహ కోల్పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందా డు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలని మాజీ సర్పంచ్ గోనె మల్లారెడ్డి కోరారు.




రాజేందర్, ఇట్ల నాగరాజు(ఫైల్)

## కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలి

*గణపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళిత కుటుంబాల నిరసన*

గణపురం, మే 13: మండలంలోని చెల్పూర్, పెద్దాపూర్ మెయిన్ రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని, ఆ స్థలంలో నిరుపేద దళితులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత కుటుంబాల వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెల 21న ప్రభుత్వ భూమి కబ్జాపై కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశామన్నారు. ఈ క్రమంలో సోమవారం రెవెన్యూ అధికారులు ఆ భూమిలో ఆక్రమణలను తొలగించే క్రమంలో కొందరు అధికార పార్టీ నాయకులు అడ్డుకున్నారని, అందువల్లే అధికారులు వెనుకడుగు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పూర్వం నుంచి మాధవరావుపల్లి సమీపంలోని భూమిలో సాగు చేసుకునే వారమని, ఏడాది క్రితం 140 మంది నిరుపేద దళిత కుటుంబాలు మాధవరావుపల్లి పక్కన ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారులు తొలగించారన్నారు. కానీ చెల్పూర్, పెద్దాపూర్ మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు అధికార పార్టీ నాయకులు, అధికారులు కుమ్మక్కై కబ్జా చేస్తే పట్టించుకునే నాథుడే లేరా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి దళిత కుటుంబాలను ఆదుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



తహసీల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న చెల్పూర్, పెద్దాపూర్ గ్రామస్తులు


## అప్‌లోడ్ అయ్యేది ఎప్పుడో?

**ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పరేషాన్**

నర్సింహులపేట, మే 13 : ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ కాకపోవడంతో లబ్ధిదారుల్లో పరేషాన్ నెలకొంది. సొంత ఇంటి కల నెరవేరుతుందన్న ఆశతో ఉన్న ఇల్లు కూలగొడితే ఇదేందని గుబులు చెందుతున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని వంతడపుల గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. గ్రామసభలు ఏర్పాటు చేసి 104 మందికి ఇందిరమ్మ పత్రాలు అందించారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి 73 మందితో మొదటి విడుత జాబితా తయారు చేశారు. దీంతో 9 మంది బేస్‌మెంట్ లెవల్, 10 మంది లబ్ధిదారులు పిల్లర్ లెవల్ నిర్మాణం చేశారు. 21 మంది ఇంటి నిర్మాణం కోసం ముగ్గు లు పోసుకున్నారు. ఇంకా 33 మంది ముగ్గులు పోసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. బేస్మెంట్ లెవల్ నిర్మాణం పూర్తయిన ఇంటికి రూ. లక్ష ఇస్తామని చెప్పడంతో అప్పోసప్పో తీసుకొచ్చి లబ్ధిదారులు పనులు చేశారు. అయితే ఇంటిని అప్‌లోడ్ చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అనే యాప్‌ను తీసుకొచ్చింది. ఇంటి నిర్మాణాన్ని పంచాయతీ కార్యదర్శి మొదట ఫొటో తీసి హౌసింగ్ ఏఈకి అప్‌లోడ్ చేయాలి. దానిని డీఈ జిల్లా పీడీకి పంపిస్తే అప్పుడు లబ్ధిదారుడికి డబ్బులు జమవుతాయి. ఇదంతా జరగడానికి కనీసం నెల రోజులు పడుతుంది. ఒక లబ్ధిదారుడి ఇల్లు మాత్రమే పంచాయతీ కార్యదర్శి లాగిన్‌లో అప్‌లోడ్ అయ్యింది. కానీ ఏఈ లాగిన్‌లో కాలేదు. మిగిలిన నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లొకేషన్‌లో 15 రోజులుగా ప్లీజ్ గో టూ ద నియరెస్టు లొకేషన్ అని చూపిస్తుండంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. దీంతో అధికారులు, లబ్ధిదారుల మధ్య గొడవలు చోటుచేసుకోవడంతో పాటు ఇంటి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. బేస్మెంట్ లెవల్ ఫొటో అప్‌లోడ్ చేస్తే రూ. లక్ష వచ్చేది. అటు అప్‌లోడ్ కాక ఇటు ఇంటి నిర్మాణ పనులు జరుగకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నిర్మాణం చేసుకున్న వారికే బిల్లు రాకపోవడంతో ముగ్గులు పోసుకున్న, ముగ్గులు పోసుకునే లబ్ధిదారులు వెనుకడుగు వేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో యాకయ్య మాట్లాడుతూ 15 రోజులుగా అప్‌లోడ్ కావడం లేదు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోతాం. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

అప్‌లోడ్ కాక చూపిస్తున్న యాప్



వంతడపులలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు